సీరియల్

వి.యస్.రావ్

(గత సంచిక తరువాయి)

పోతరాజు పగలబడి నవ్వాడు. "మా కేసు లన్నింటికీ ఇకనుంచి పర్మనెంట్ సాక్షులు మీరే! పని పడినప్పుడు కబురుచేస్తా. వెళ్ళండి!" అన్నాడు.

ఇద్దరూ మెల్లిగా కదిలారు.

"కృష్ణంరాజూ" పోతరాజు పిలిచాడు, కృష్ణంరాజు గిరుక్కున వెనక్కి తిరిగాడు.

"కిందికి దిగడానికి వేరే రోడ్డు, తెలుసుగా?" పోతరాజు ప్రశ్నించాడు.

"కొండమీదున్న ఈ హోటల్ కి లెక్కలేనన్నిసార్లు వచ్చాను!" కృష్ణంరాజు నవ్వుతూ అన్నాడు. అతను రాక్ హిల్ హోటల్ కి రావడం ఇదే మొదటిసారి.

ఇద్దర్నీ మాయంచేస్తూ మూసుకున్న తలుపుని వోసారి

చూసి, పోతరాజా టేబుల్ మీదున్న సీసాల్నీ, గాజుల్నీ, ప్లేట్లనీ పెద్ద ట్రేలోకి సర్దాడు. ట్రేని మంచంమీద పెట్టి, టేబుల్ని మునుపట్లా గోడవారగా లాగి, శుభ్రంగా తుడిచాడు. కుర్చీల్ని మామూలుగా సర్దేశాడు. తలుపు తెరిచాడు ట్రే పట్టుకుని పక్కగదిలోకి వెళ్ళాడు. తిరిగొచ్చి, గదిని పరిశీలనగా చూసి, తలుపు మూసి తాళం వేసి, పక్కగదిలో దూరి తలుపు మూసుకున్నాడు.

కుర్చీలో కూచుని సిగరెట్ వెలిగించాడు. ముందు జాగ్రత్తతో మరో వ్యక్తి పేరుతో పక్కగదికూడా తీసుకున్నందుకు సంతోషిస్తూ, నవ్వుకున్నాడతను. ఇలాంటి లావాదేవీలు అతిరహస్యంగా జరగాలి!

* * *

కృష్ణంరాజా టాక్సీని కుడివైపు తిప్పి పోనిచ్చాడు. అతని పక్కనే కూచున్న మస్తాన్ రావు ఉషారుగా మరో సిగరెట్ వెలిగించాడు.

వచ్చినప్పుడు జల్లులుగా పడుతున్న వర్షం కొంచెం బలిసింది.

కృష్ణంరాజా ఈల వేస్తూ కార్ని మలుపు తిప్పాడు. లైట్లెందుకో మరీ డిమ్‌గా వెలుగుతున్నాయి. బ్యాటరీ ఛార్జ్ చేసి రెండురోజులు కూడా కాలేదు.

"కేసవగానే వాళ్ళు మనల్ని మరిచిపోతారనుకున్నా!" కృష్ణంరాజా చిన్నగా నవ్వాడు.

మనుషుల తత్వం బాగా తెలిసిన మస్తాన్ రావు చిన్నగా నవ్వాడు.

"మరిచిపోయేవారే! కానీ, ఎవరో ప్రశ్నలు అడిగి, అంతా తిరగతోడడానికి రెడీ అవుతున్నారటగా?

అందుకే మనం నోరు జారకుండా వుంటానికే ఈ పైకం ముట్టజెప్పారు!"

"అలాగా?" కృష్ణంరాజు అనుమానంగా అన్నాడు.

"మీరెలాగనుకుంటున్నావ్! బ్రదర్, లోకం సంగతి నీకు తెలీదు. పనివుంటేగానీ, నీ కెవ్వడూ పైసలివ్వడు!" మస్తాన్ రావు తెలివిగా అన్నాడు.

"రైట్! ఆ ప్రశ్నలు అడగబోయే వ్యక్తులకి మనం యెంతో రుణపడ్డాం!" కృష్ణంరాజు నవ్వాడు. మస్తాన్ రావు నవ్వలేదు.

"బ్రదర్. బంగారు గుడ్లుపెట్టే బాతు దొరికింది మనకు!" మస్తాన్ రావు వున్నట్టుండి అన్నాడు.

కృష్ణంరాజు వులిక్కిపడ్డాడు. "ఏమిటి?" అరిచాడతను వోరగా చూస్తూ. మస్తాన్ రావు చిన్నగా నవ్వాడు.

"నెలకోసారి, ఎవరో వ్యక్తి మనకోర్టు సాక్ష్యాల గురించి ప్రశ్నిస్తూ వుంటే ఏమవుతుంది?" ప్రశ్నించాడతను.

"ఏమిటవుతుంది?" కృష్ణంరాజు అడిగాడు.

"ప్రతీ నెలా పెన్షన్ లాగా మనకి డబ్బొస్తూ వుంటుంది!" మస్తాన్ రావు నవ్వుతూ అన్నాడు.

"ఆఁ?" అన్నాడు అర్థంకాని కృష్ణంరాజు.

"ప్రతీనెలా యెవరో వ్యక్తి మనల్ని ప్రశ్నిస్తాడు. మనం ఆ సంగతి భూపాలంకి చెప్తాం. ఆ వ్యక్తి అయిదు వేలిస్తానంటున్నాడంటాం, మనం నోరు తెరవడానికి. అప్పుడు మనం నోరు మూసుకోడానికి భూపాలం చచ్చినట్టు యేపదివేలో ఇస్తాడు!" మస్తాన్ రావు సగర్వంగా నవ్వాడు.

కృష్ణంరాజు ఉషారుగా ఈల వేశాడు. రోడ్డుని

వోసారి చూసి, మస్తాన్‌రావువైపు తలతిప్పాడు. "బాగానే వుంది. ప్రతీనెలా మనల్ని ఆ 'ఎవరో వ్యక్తి' అడగొద్దా!" సంకోచిస్తూ అన్నాడతను.

మస్తాన్‌రావు బిగ్గరగా నవ్వాడు. "రాజా, నువ్వు బంటులా ఆలోచిస్తున్నావ్! ఏ వ్యక్తీ మనల్ని అడగనక్ఖర్లేదు. అడుగుతున్నట్టు మనం నెలనెలా చెప్తూ వుంటాం!"

కృష్ణంరాజు ఎడంచేతో అతని భుజాన్ని చరిచాడు. "ఔను! అది నాకు తట్టలేదు!"

"అందరికీ అన్నీ తట్టితే మస్తాన్‌రావెందుకు? నన్ను కల్సుకుంటూ వుండు. నాటకం ఎలా నడపాలో చెప్తా. ప్రతీసారీ ఇద్దరం ఒకేలాగా చెప్పాలి" అన్నాడు మస్తాన్‌రావు సాలోచనగా.

"ఆ భూపాలం యెవరో, ఎక్కడుంటాడో మనకి తెలీదుగా?" కృష్ణంరాజు కళ్ళు చిట్లించి రోడ్డుని చూస్తూ అన్నాడు.

"అదంతా నా కొదిలెయ్. వచ్చేనెల మొదటివారం నన్ను కల్సుకో!" మస్తాన్‌రావు గంభీరంగా అన్నాడు.

రోడ్డు మలుపు తిరిగింది. స్లో చేయబోతూ కృష్ణంరాజు బ్రేక్ పెడల్ని తొక్కాడు. పెడల్ లూజాగా బోర్డుని తాకింది. కారు స్లో కాలేదు. ఆశ్చర్యపోతూ స్టీరింగ్‌ని తిప్పాడతను. టైర్లు కీచుగా అరిచాయి. రోడ్డు వాలుగా కిందికి దిగుతోంది. కృష్ణంరాజు మళ్ళీ బ్రేక్ నొక్కాడు. కారు స్పీడులో మార్పులేదు.

"బ్రేక్ ఫెయిలయ్యింది!" కంగారుగా అన్నాడతను. మస్తాన్‌రావుకి మత్తు దిగిపోతున్నట్టనిపించింది.

"ఇంజన్ ఆఫ్ చెయ్!" గాభరాగా అరిచాడతను.

కృష్ణంరాజు కళ్ళు చిట్లిస్తూ చూశాడు. రోడ్డుమధ్యలో ఎర్రటి అక్షరాల్తో వున్న బోర్డు అతని కళ్ళని పొడుస్తూ కనిపిస్తోంది. "రోడ్డు మరమ్మతులో వుంది. ఎడమవైపు తిరగండి" అంటూ హెచ్చరిస్తోంది బోర్డు.

బ్రేకులు నొక్కడానికి వ్యర్థంగా ప్రయత్నిస్తూ, కృష్ణంరాజు బోర్డుమీదికి దూసుకెళ్తున్న కార్ని చివరి నిమిషంలో యెడమకి తిప్పాడు. మస్తాన్ రావు పక్కనున్న బ్రీఫ్ కేసుమీద చెయ్యివేశాడు.

క్షణంలో గాలిలో తేలుతున్నట్టనిపించిందతనికి. చక్రాలకింద నేల మాయమైందా? ఏం జరిగిందో అతని మెదడుకి తట్టేలోగా కారు రెండువందల అడుగుల లోతున్న అగాధంలోకి వేగంగా దొర్లుకుంటూ పోతోంది కారూ, దానివెంట పొర్లుతున్న రాళ్ళూ ఆ చీకటి రాత్రిలో భీకరంగా చప్పుడు చేశాయి.

కాసేపట్లో శబ్దం తగ్గింది. లోయలోంచి మంటలు లేచాయి....

చీకట్లోంచీ, చప్పుడు చేయకుండా, రోడ్డు మధ్యకి నడిచాడు జాకీ. లోయలోకి దొర్లుకుపోయిన కారు యేమయ్యిందో చూడక్కర్లేదు!

నడిరోడ్డులో మూడురాళ్ళమధ్య భద్రంగా ఇరికించి నిలబెట్టిన బోర్డుని లాగాడు. కిందపడేసి, మూడురాళ్ళనీ లోయలోకి విసిరేశాడు. బోర్డుని అందుకుని, ఇరవైగజాల దూరంలో వున్న మలుపు దగ్గర, చీకట్లో ఆపిన వాన్ వైపు జోరుగా నడిచాడు. అతనికి బిగ్గరగా, విజయోత్సాహంతో నవ్వాలనిపిస్తోంది.

• • •

మనోజ్ హోటల్ గదిలో కాలుకాలిన పిల్లిలా

పథార్థుచేస్తున్నాడు. ఒకటి యాదృచ్ఛికం కావొచ్చు. ఒక విషయంతో సంబంధం వున్న వివిధ వ్యక్తులు ఒకేరోజు ప్రమాదవశాత్తూ మరణిస్తే, దాన్ని నిర్లక్ష్యం చేయడానికి వీల్లేదు.

పొద్దుటే మస్తాన్‌రావుని కల్సుకోడానికి వెళ్ళిన అతనికి పెద్ద షాక్ తగిలింది. గతరాత్రి, పన్నెండు ప్రాంతంలో కొండదారిలో జరిగిన కారు ప్రమాదంలో మస్తాన్‌రావు మరణించాడు. టాక్సీ తోలిన వ్యక్తి, కృష్ణంరాజు! ఒక్క దెబ్బకి రెండు పిట్టలు! ఏదో మాస్టర్ మైండ్ చాకచక్యంగా రాక్షసంగా అంతా నడిపిస్తోంది....

మనోజ్ బుర్ర వేడెక్కుతోంది. కొత్త పాకెట్లోంచీ సిగరెట్ తీసి వెలిగించాడతను. టాక్సీ నంబర్నిబట్టీ, సగం సగం కాలిన శరీరాల్నిబట్టీ వాళ్ళిద్దర్నీ పోల్చడం జరిగింది. చీకట్లో, వర్షంలో తడిసిన రోడ్డుమీద స్కిడ్ అవడంమూలాన కారు లోయలోకి దొర్లిపోయిందని పోలీసులు తీర్మానించుకున్నట్టు పేపర్లు చెప్తున్నాయి. మంచంమీద పడేసిన పేపర్ని పక్కకితోసి, మనోజ్ నీరసంగా మంచంమీద వాలాడు.

తను అన్వేషణ సాగిస్తున్నట్టు ఎవరేనా పసిగట్టారా? లేక ముందుజాగ్రత్తతో తప్పుడు సాక్షుల్ని నిర్మూలిస్తున్నారా? అరితేరిన నేరస్థుడు, తాత్కాలికంగా భయంలేకపోయినా భవిష్యత్తుని దృష్టిలో వుంచుకుని తనకి సహకరించిన వాళ్ళని తుదముట్టించవచ్చు. తను డబ్బుతో వాళ్ళని కొన్నాడు. అలాంటి వ్యక్తులు తరువాతకూడా డబ్బుకోసం ఇతర్లకి అమ్ముడుపోవచ్చు. రాజమ్మ, మస్తాన్‌రావు, టాక్సీ డ్రైవర్ కృష్ణంరాజు—

ఇంకా ఎవరెవరు ఇలా బలైపోతారు?

మనోజ్ తటాలున లేచికూచున్నాడు. తను నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. ఇవన్నీ ముందుచూపుతో చేసిన హత్యలు మాత్రమే కావు. తను రంగంలోకి దిగినట్టు పసిగట్టాక — ముందుచూపుతో చేసిన హత్యలు!

రాజమ్మ ఇంటిని వెతుక్కుంటూ మొదటిసారి తను వెళ్ళినప్పుడు అక్కడ బెలూను అమ్ముకుంటూ కనిపించిన వ్యక్తి, ముస్తాన్ రావు ఇంటి ప్రాంతంలోకూడా రోడ్డు మీద తనకి కనిపించాడు! రాజమ్మ చనిపోయిన రోజు రోడ్డుమీదున్న టీస్టాల్ దగ్గర తను ఆగాడు. అప్పుడు, చిన్న సైకిల్ పంపుతో బెలూన్లకి గాలికొడుతూ రోడ్డు మీద కూచున్న బెలూన్ల వ్యక్తిని తను చూశాడు. పట్టించుకోవడం మానేశాడు! అతను తర్వాత హోటల్ దగ్గరకూడా కనిపించాడు.

గుడ్ గాడ్! తను నిజంగా బడుద్ధాయిలా వ్యవహరించాడు. తను ఎక్కడికెళ్తే అక్కడ బెలూన్లు అమ్మాల్సిన అవసరంలేదు! గాలిపటం తోకలా అతను తనని వెంటాడుతూనే వున్నాడు. ఈ గాలిపటానికి అదొక్కటే తోక అనుకోడానికి వీల్లేదు! అవులమధ్య అవు తేళ్ళలా అమాయకంగా రోడ్లలో తిరిగే జనంలో తనని గమనించే కళ్ళు ఎన్ని వున్నాయి? తనని వెంటాడే కాళ్ళు ఎన్ని వున్నాయి?

మనోజ్ మరో సిగరెట్ వెలిగించి పచార్లు ప్రారంభించాడు తన ఉనికి, తన ఉద్దేశం 'వాళ్ళకి' ఎట్లా తెలిశాయి? ఇప్పటిదాకా తను ఇద్దరు వ్యక్తుల్ని మాత్రమే కలుసుకున్నాడు. తన అన్నయ్య కరుణాకర్, లాయర్ రంగనాథ్.

రంగనాథ్ భార్యను గాయపరచి, అతన్ని హెచ్చరించి తరవాతకూడా వాళ్ళు అతనిమీద ఒక కన్నేసి వుంటారు! ఆ కంట్లో తను పడివుంటాడు! ఎలాగో తన సంగతి కనుక్కొని తనని తమ మైక్రోస్కోప్ కింద పెట్టారు ఆ వ్యక్తులు!

తను ఇంక రెప్పల్ని కళ్ళకి దూరంగా వుంచి, అనుక్షణం మెలకువగా వుండాలి! ఇంకా నరబలులు సాగకుండా చూడాలి.

• • •

కాఫీ ముగించి మనోజ్ లాంజిలోకి అడుగులు వేశాడు. అక్కడా ఇక్కడా కుర్చీలో కూచున్నారు అయిదారుగురు.

మనోజ్ సిగరెట్ వెలిగించి రోడ్డుమీదకి నడిచాడు. హోటల్ ముందు ఆగి, అటూ ఇటూ చూసుకెళ్తున్న వాహనాల్ని చూస్తూ వుండిపోయాడు.

మనోజ్ కళ్ళు బెలూన్లకోసం గాలిస్తున్నాయి. బెలూన్ల వ్యక్తి ఎక్కడా కనిపించలేదు.

ఆలోచిస్తూ మనోజ్ వెనక్కి తిరిగి హోటల్ లాంజి వేపు అడుగులు వేశాడు. లిఫ్టువేపు తిరగబోతూ తటాలున ఆగాడు.

గోడవారగా సోఫాలో కూచున్న వ్యక్తి, న్యూస్ పేపర్ని మొహానికి అడ్డంగా లాగడం అతని దృష్టిని ఆకర్షించింది.

తెల్లటి వెంట్రుకలు పక్కపాపిడి క్రాఫు. పొడుగాటి మొహంలో ముక్కు పొడుగ్గా కూచిగా అవుపిస్తోంది. ఇవాళ పొద్దుటిదాకా తను వున్న హోటల్ లాంజిలో న్యూస్ పేపర్ పట్టుకొని, ఏకాగ్రతతో చదువుతూ

ప్రతీసారీ తనకి కనిపించాడతను! బెలూన్! న్యూస్ పేపర్! మనోజ్ తనలో నవ్వుకున్నాడు.

వెళ్ళి అతని పక్కనే కూచుని, న్యూస్ పేపర్ లాక్కుని, పొడుగాటి ముక్కుని పచ్చడిచేసి, బుద్ధి చెప్పాలనిపించిం దతనికి. బిగుసుకుంటున్న పిడికిళ్ళను విడదీసుకుంటూ మనోజ్ తనని సంభాళించుకున్నాడు.

తను వాళ్ళని కనిపెట్టినట్టు వాళ్ళకి తెలీకూడదు. తనలాంటి వాళ్ళని నీడలా వెంటాడే, ఇలాంటివాళ్ళంతా తోకలు. తలలు యెక్కడో దాక్కునివుంటాయి. ఈ తోకలు, మెల్లిగా తనని తల దగ్గరకు తీసుకెళ్తాయి! మనోజ్ లిఫ్ట్ వేపు అడుగులేశాడు.

లిఫ్ట్‌లో మారి, తటాలున వెనక్కి తిరిగాడు. న్యూస్ పేపర్ తటాలున జరిగి, తనవేపు చూస్తున్న ఆ వ్యక్తి ఎడమకంటిని మూసేసింది.

తలుపులు మూసుకున్నాయి. లిఫ్ట్ కదిలింది.

• • •

మనోజ్ డ్రెస్ చేసుకొని, సూట్‌కేస్ సర్దాడు. గదంతనీ ఒకసారి పరిశీలించి, ఇవతలికి నడిచాడు.

రిసెప్షన్ ముందు నిలబడి వోరగా చూశాడు. 'న్యూస్ పేపర్' యథాస్థానంలో వుంది! లోపల్లోపల సంతోషిస్తూ మనోజ్ రిసెప్షనిస్టుని చూశాడు.

"గది ఖాళీచేస్తున్నా" అన్నాడతను న్యూస్ పేపర్ వెనక దాక్కున్న వ్యక్తికోసం, కంఠస్వరం బాగా పెంచి.

"నెలరోజు లుంటామన్నారు?" రిసెప్షనిస్టు నవ్వుతూ ప్రశ్నించాడు.

"ఉండాలనుకున్నా. కానీ అర్మీ ఉద్యోగంగా!

బోగర్ ఏరియాలో గొడవలు. ఉన్నపళాన శైలేంద్రవాని వుత్తరువొచ్చింది!" మనోజ్ నవ్వుతూ బిగ్గరగా అన్నాడు. న్యూస్ పేపర్ కదల్లేదు.

"టికెట్ బుక్ చేయించమంటారా?" రిసెప్షనిస్టు అడిగాడు.

"నో. థాంక్స్, పాస్ వుంది. ఎంతైంది?" మనోజ్ ప్రశ్నించాడు.

"నూటఅరవై అయిదు రూపాయలివ్వండి" అన్నాడు రిసెప్షనిస్టు.

మనోజ్ పర్సులోంచీ డబ్బుతీసి కౌంటరుమీద పడేశాడు.

"ఇటువేపు వస్తే, మా హోటల్‌కే రండి సార్!" రిసెప్షనిస్టు నవ్వుతూ ఆహ్వానించాడు.

"థాంక్స్ మూడ్రోంతులు ఇటువేపు రాను!" అంటూ మనోజ్ హోటల్లోంచీ ఇవతలికి నడిచాడు. టాక్సీ చేసుకొని స్టేషన్‌కు వెళ్ళాడు.

స్టేషన్‌లో పబ్లిక్ టెలిఫోన్ బూత్‌ని చూడగానే అతనికి రంగనాథ్ గుర్తువచ్చాడు. తను వెళ్ళిపోతున్నట్టు అందరికీ తెలియడం మంచిది. నవ్వుకుంటూ అతను టెలిఫోన్ బూత్‌లోకి దూరాడు. బూత్‌కు కొద్ది దూరంలో బెలూన్లు ఎగురుతూ కనిపించాయి మనోజ్‌కు.

• • •

ఉదయం తొమ్మిది గంటలు కావస్తోంది.

పైజామా, జుబ్బా, అవజోళ్ళా ధరించి మనోజ్ కుంటుతూ హోటల్లోంచి ఇవతలికి నడిచాడు.

తనకి పరిచయమైన ఇద్దరు వ్యక్తుల్లో ఎవరేనా వున్నారేమో అని అటూ ఇటూ పరిశీలనగా చూశాడతను.

న్యూస్ పేపరు, బెలూన్లూ లేవు! చిరునవ్వు నవ్వుకుంటూ, హోటల్ ముందున్న న్యూస్ స్టాండు వేపు వంటుతూ అడుగులేశాడు.

వారం రోజుల తర్వాత ఆ రోజు ఉదయమే అతను ఢిల్లీ నుండి తిరిగివచ్చాడు.

రెండు దినపత్రికలూ, మూడు మాసపత్రికలూ, మూడు సినిమా పత్రికలూ, రెండు ఇంగ్లీషు పత్రికలూ, కొన్నాడు. అన్నింటిని దొంతరగా పట్టుకొని, రోడ్డు దాటి ఎదురుగా వున్న లక్ష్మీ సైకిల్ మార్ట్ ని సమీపించాడు.

పాపతను ప్రశ్నార్థకంగా చూశాడు. అద్దెకి సైకిల్ కావాలన్నాడు మనోజ్. పాపతను అనుమానంగా చూశాడు. మనోజ్ పక్కకి తిరిగి, దగ్గరగా వున్న హీరో సైకిల్ కారేజ్ కి పేపర్ల దొంతర తగిలించాడు. ఆశ్చర్యంగా చూస్తున్న పాపతన్ని నవ్వుతూ చూశాడు.

జుబ్బా జేబులోంచీ అయిదువంద రూపాయల నోట్లు తీసి అతనివైపు చాచాడు.

“పేరు సుబ్బారావు మూడుగంటల్లో సైకిల్ వాపసు చేస్తా” అంటూ సైకిల్ మీద చెయ్యేశాడు.

పాపతను గారపళ్ళను చూపిస్తూ నోట్లు అందుకున్నాడు.

“పేరెందుకులెండి. తీసుకెళ్ళండి!” అన్నాడు.

మనోజ్ హోటల్ వేపు వోసారి చూసి, సైకిల్ని ఫుట్ పాత్ మీంచీ రోడ్డుకి దించాడు. కళ్ళద్దాల్ని సరి చేసుకొని ఈల వేస్తూ సైకిల్ మీదికి ఎగిరాడు. సైకిల్ వేగంగా కదిలింది....

పదినిమిషాల తరవాత మనోజ్ సైకిల్ని మెయిన్ రోడ్డులోంచీ సైడ్ రోడ్డులోకి తిప్పాడు. మలుపులో వున్న టీస్టాల్ ముందు ఆపి, కిందికి దిగాడు. స్టాండ్ వేసి టీ

స్టాల్‌లోకి వెళ్ళాడు. రోడ్డువైపు తిరిగి, కుర్చీలో కూచుని స్ట్రాంగ్ టీ ఆర్డరిచ్చాడు. టీ చప్పరిస్తున్నా అతని చూపులు రోడ్డుని నిశితంగా గాలిస్తున్నాయి.

టీ ముగించి బిల్లు చెల్లించి, ఇవతలికి వచ్చాడు. సైకిల్ దగ్గరగా నించుని, జేబులోంచి సిగరెట్ పాకెట్ తీశాడు. తీరుబడిగా సిగరెట్ వెలిగించాడు. హుషారుగా సిగరెట్ పీలుస్తూ రోడ్డు పొడవునా తన చూపుల్ని పరుగెత్తించాడు. ఎదురుగా వున్న షాపుల వైపు నిదానించి చూసి, సైకిలెక్కాడు.

మనోజ్ అయిదు నిమిషాల్లో, న్యూ కాలనీలో 56 నంబరు ఇంటిముందు సైకిల్ ఆపాడు. ఎడమకాల్ని మెట్టుమీద ఆనుకొని, రెండుసార్లు బెల్ మోగించాడు.

విసుగు నటిస్తూ జుబ్బాచేత్తో నుదుర్ని అంటిన చెమట అద్దుకున్నాడు. మెల్లిగా తలతిప్పి వెనక్కి చూశాడు. రోడ్డు ఖాళీగా వుంది.

కిందికి దిగి, సైకిల్ పెడల్ని మెట్టుకి ఆన్చాడు. న్యూస్ పేపర్లనీ, మాగజైన్సనీ చేతికింద ఇరికించి, నాలుగు మెట్లూ యెక్కి వసారాలో, తలుపుముందు ఆగాడు. అతని కుడిచెయ్యి పైకిలేచింది. వేళ్ళకణుపులు తలుపుమీద చప్పుడు చేశాయి. రెండోసారి తలుపుతట్టి, మనోజ్ రోడ్డువైపు తిరిగాడు. యాంత్రికంగా రోడ్డు మీద అటూ ఇటూ చూశాడు.

తలుపు వెనక మెత్తగా అడుగుల చప్పుడు. కాసేపట్లో గడియతీసిన చప్పుడు అతనికి వినిపించింది. తలుపు కొద్దిగా వెనక్కి జరిగింది. తలుపుకీ, ద్వారబంధానికీ మధ్య నించున్న యువతి అతన్ని ప్రశ్నార్థకంగా చూసింది.

మనోజ్ తేలిగ్గా ఊపిరిపీల్చుకుంటూ, చిరునవ్వు

నవ్వాడు. చంకలో ఇరికించిన న్యూస్ పేపర్ల దొంతరని ఆమె చూసేలా ముందు పట్టుకున్నాడు. ఆమె కళ్ళల్లో ప్రశ్నార్థకం జతకి ఆశ్చర్యార్థకం చేరింది.

"అవి మాకు కాదు. ఎవరిల్లు కావాలి మీకు?" సన్నటి కంఠం మనోజ్‌ని ప్రశ్నించింది.

"అడ్వొకేట్ అన్నారావుగారిల్లు...." మనోజ్ మెల్లిగా అన్నాడు.

"ఇదే. అయితే వాటికి మేం ఆర్డరివ్వలేదు...." అందామె సందేహిస్తూ.

"మిస్ ఇందులేఖా, మీ నాన్నగారి గురించి మీతో మాట్లాడాలి; పత్రికలివ్వడానికి నేను రాలేదు!" మనోజ్ కంఠం బాగా తగ్గించి, అన్నాడు. త్వరగా ఇంట్లోకి వెళ్ళాలని అతని హృదయం ఆశిస్తోంది.

తన పేరుని ఉచ్చరించిన అపరిచిత యువకుణ్ని ఇందులేఖ ఆశ్చర్యంతో చూసింది. "మీరు.. మీరెవరు?" ఆమె కంఠం కొద్దిగా వణికింది.

"నా పేరు మనోజ్ ....ముందు లోపలికి వెళ్దాం.... అంతా వివరిస్తాను...." మనోజ్ చిరునవ్వు నవ్వుతూ అన్నాడు.

ఆమె విశాల నేత్రాల్లో యేదో సందేహం అద్దంలా ప్రతిబింబంలా అవుపిస్తోంది. మనోజ్ అసహనంగా కదిలాడు.

"ఎవరే అమ్మాయ్?" ఏదో కంఠం లోపల్నుంచీ వణుకుతూ ప్రశ్నించింది.

"ఎవరో నాన్నగారి గురించి వాకబు చేస్తూ వచ్చారు, నాయనమ్మా," ఇందులేఖ మొహం పక్కకి తిప్పి జవాబిచ్చింది. ఆమె జడ త్రాచుపాములా కదిలింది. మరె

పూలు మనోజ్ వైపు నవ్వాయి. ఆమె తలతిప్పి అతన్ని చూసింది. ఆమె చూపులు అతని చూపుల్ని దేనికోసమో వెతుకుతున్నాయి. తను చూపుల్తో గాలించే దుర్మార్గమేదీ అతని చూపుల్లో ఆమెకి కనిపించినట్టు లేదు....

తలుపుని బార్లా తెరిచిందామె. "రండి" అంటూ దూరంగా జరిగింది.

"థాంక్స్" అంటూ మనోజ్ గుమ్మం దాటాడు.

సన్నగా, పొడుగ్గా వున్న ఇందులేఖ నడక కళ్ళని లాగి, చూపుల్ని తనవెంట ఈడ్చుకుపోతుంది. ఊదా రంగు పోలియెస్టర్ చీర, అందమైన ఆయిల్ పెయింటింగ్‌ని చక్కటి ఫ్రేములా ఆమె అందాన్ని హెచ్చు చేస్తోంది. మనోజ్ ఆమెని వెంబడించాడు.

చిన్నగది, ఒకవైపు గోడని పుస్తకాలున్న రాక్స్ పూర్తిగా కప్పేశాయి. చిన్న టేబుల్‌కి రెండువైపులా రెండు కుర్చీలు. అది అన్నారావుగారు ఆఫీసుగా వుపయోగించిన గది అని రాక్స్‌లోని లా పుస్తకాలు చెప్తున్నాయి. కిటికీమీద, గోడకి తగిలించిన ఫోటోకి పూలదండ వేళ్ళాడుతోంది.

"కూర్చోండి" ఇందులేఖ కంఠం అతన్ని హెచ్చరించింది. మనోజ్ ఆమె యెదురుగా కూచుని, విచారంగా చూశాడు.

"అయామ్ సారీ. మీ నాన్నగారు....పోయారు...." అన్నాడతను.

ఇందులేఖ కళ్ళు బాధకి పట్టిన అద్దాల్లా వున్నాయి. "థాంక్స్....నాన్న కార్ని చాలా జాగర్తగా తోలేవాడు. అయినా యాక్సిడెంట్ అయింది..." ఆమె కంఠం వణికింది.

మనోజ్ ఆమెని జాలిగా చూశాడు. యాక్సిడెంట్! అది యాక్సిడెంట్ కాదనీ, హత్యా అనీ తను ఆమెకి చెప్పగలడా?

"మిస్ ఇందులేఖా, అడ్వొకేట్ కరుణాకర్ నా అన్నయ్య. ఆయన విషయం.... మీకు తెలుసనుకుంటాను" అంటూ ఆగాడతను.

ఆమె మనోజ్‌ను ఆశ్చర్యంగా చూసింది.

"నాన్న.... కేసు గురించి నాతో చూచాయగా అన్నాడు. తరవాత జరిగిందంతా పేపర్లలో చదివాను" ఇందులేఖ అంది.

మనోజ్ ఆమెని తదేకంగా చూశాడు. "మరణించే ముందు నాన్నగారు తను మా అన్నయ్య కేసుని వాదించ బోతున్నట్టు చెప్పారా?"

ఆమె తలాడించింది. ఆమె చెవులకి వేళ్ళాడుతున్న రింగులు వూగిసలాడాయి. "జైల్లో ఆయన్ని కలుస్తున్నట్టు నాన్న చెప్పాడు. మీ అన్నగారు నిరపరాధి అని ఆయన నాతో అన్నాడు...."

"మిస్ ఇందులేఖా, మీ నాన్నగారు చెప్పింది నిజం. మా అన్నయ్య నిర్దోషి!" మనోజ్ వుద్రేకంతో అన్నాడు. "కానీ నిర్దోషికి శిక్ష విధించబడింది. ఆయన్ని సర్వనాశనం చేయడానికి బ్రహ్మాండమైన కుట్ర సాగించ బడింది. ఆ కుట్రకి కారకులైనవాళ్ళ గురించిగానీ, కారణాల గురించిగానీ నాన్నగారు మీతో యేమేనా అన్నారా? ఎంత చిన్న విషయం అయినా ఫరవాలేదు."

ఇందులేఖ విచారంగా చూసింది. "కరుణాకర్ మీద యేదో కుట్ర సాగుతోందనీ, అపత్యాల ఇటుకలతో సమాధిచేసే ప్రయత్నం సాగుతోందనీ నాన్న అన్నాడు.

భార్య హత్యతో జీవచ్ఛవంలా అయిపోయిన ఆయన్ని ఆదుకోవాలనీ, కోర్టులో ఆయన తరఫున వాదించబోతున్నాననీ నాన్న అన్నాడు. అయితే, మృత్యువు ఆయన్ని ఆటకాయించింది...." ఆమె కంఠం విచారంతో గాద్గదికం అయ్యింది.

మనోజ్ ఆమెని నిదానించి చూశాడు. "మీ నాన్నగారు యాక్సిడెంట్‌లో మరణించలేదు. ఆయన హత్య చేయబడ్డారు!"

ఇందులేఖ ఉలిక్కిపడి, తటాలున లేచి నిలబడింది. ఆమె కళ్లు అయోమయంగా చూస్తున్నాయి. ఎర్రటి పెదవులు అదురుతున్నాయి.

"నాకు....అర్థంకావడంలేదు...." అందామె వణికే గొంతుతో.

"అయామ్ సారీ. బాధ కలిగించినాకూడా, మీకు నిజం చెప్పాలి. మా అన్నయ్యకు సహాయం చేయాలనుకున్న నిర్ణయం ఆయన్ని హతమార్చింది. అన్నయ్య శత్రువులు ఆయన్ని తుదముట్టించారు. హత్యని యాక్సిడెంట్‌లా కనిపించేలా చేశారు!"

ఇందులేఖ బలహీనంగా కుర్చీలో కూచుంది. "నేను నమ్మలేకుండా వున్నాను...."

"కేసు జరుగుతున్నప్పుడు మా అన్నయ్యకి సహాయం చేయాలనుకున్న అన్నారావుగారి నోరు నొక్కారు వాళ్ళు. కేసు పూర్తయి అన్నయ్యకి శిక్ష పడ్డాక, నేను నిజంకోసం అన్వేషణ ప్రారంభించాక — కేసులో అన్నయ్యకి వ్యతిరేకంగా తప్పుడు సాక్ష్యాలు చెప్పిన వ్యక్తుల నోళ్ళూ నొక్కేస్తున్నారు...."

"వాట్?" ఇందులేఖ అరిచింది. మనోజ్ చిన్నగా

నవ్వాడు. లాయర్ రంగనాథ్‌ని బెదిరించిన విషయం గురించీ, వున్నట్టుండి క్యూ పద్ధతిలో మరణించిన ముగ్గురు పాత్రుల గురించీ ఆమెకి వివరించాడు.

"ఇవన్నీ స్వాభావిక మరణాలు కావు. అలాగే మీ నాన్నగారిదికూడా...." అన్నాడతను.

ఇందులేఖ కళ్ళు వున్నట్టుండి నీళ్ళతో నిండాయి. బుగ్గలమీదికి జారుతున్న అశ్రువుల్ని అరచేత్తో తుడుచుకుందామె.

"మిమ్మల్ని నొప్పించడానికి ఈ సంగతి చెప్పలేదు. మీరు జాగ్రత్తగా వుండాలన్న వుద్దేశంతో నిజం మీకు తెలియజేశాను. మీనుంచీ యేవేనా విషయాలు తెలుస్తాయేమో అని వచ్చాను. ఈసారి చాలా జాగ్రత్తగా మిమ్మల్ని కలుస్తున్నాను. మిస్ ఇందులేఖా, అపరిచితుల్ని ఇంట్లోకి రానివ్వకండి...."

"నేను అలా యెవర్నీ రానివ్వను...." అందామె అడ్డొస్తూ.

"నన్ను రానిచ్చారు!" మనోజ్ నవ్వుతూ అన్నాడు.

ఇందులేఖ రెప్పల్ని దించుకుంటూ చిరునవ్వు నవ్వే ప్రయత్నం చేసింది.

"మీరు వుద్యోగం చేస్తున్నారా?" మనోజ్ ప్రశ్నించాడు.

"లేదు...." ఆమె తల అడ్డంగా వూగింది. అతని కళ్ళల్లోని ప్రశ్నను ఆమె అర్థంచేసుకుంది "ఇన్సూరెన్స కంపెనీ వారికి యాభై వేలు వచ్చింది. నాన్న పాలసీ మీద మరో పాతిక వేలొచ్చాయి. వారు పైకంతో, అద్దెకి వున్న ఈ ఇంటిని బాబాయి నా సొంతం చేశాడు" అందామె చిన్నగా నవ్వుతూ.

మనోజ్ ఆమెని తదేకంగా చూశాడు. "మిస్ ఇందులేఖా, మా అన్నయ్యకోసం, న్యాయంకోసం మీ నాన్నగారు బలైపోయారు. ఆయన ఋణం నేను తీర్చు కుంటాను. అపార్థం చేసుకోకండి. నేను కొంత.... కొంత....డబ్బిస్తాను...."

"నో థాంక్స్!" ఇందులేఖ అడ్డు తగిలింది. ఆమె కళ్ళు తీక్షణంగా చూస్తున్నాయి. "న్యాయంకోసం పాటుపడిన నాన్నను, అమాయకుడైన నాన్నను హత్య చేసిన దుర్మార్గుల్ని వెతికిపట్టండి. వాళ్ళకి శిక్షపడేలా చూడండి! మీరు ఋణం తీర్చుకోవాల్సిన మార్గం అదే!" అందామె ఉద్రేకంతో.

తడిగా, ఎర్రగా మెరుస్తున్న ఆమె కళ్ళని మనోజ్ ఆవేశంతో చూశాడు. లేచి నిలబడ్డాడు. "ఇంతవరకూ ప్రతి వ్యక్తీ నన్ను వెనక్కి తిరిగి పారిపొమ్మన్నాడు. మీ రొక్కరే ముందుకి వెళ్ళమంటున్నారు! థాంక్యూ వెరీమచ్!" అన్నాడు ఆనందంగా.

"నాన్న ప్రమాదవశాత్తూ మరణిం చాడనుకున్న నాకు, ఆయన హత్యచేయబడ్డాడన్నది భరించలేనిదిగా వుంది" ఇందులేఖ గాద్గదికంగా అంది. మళ్ళీ ఆమె కళ్ళు నీళ్ళతో నిండాయి. తలతిప్పి తండ్రి ఫోటో వేపు చూడసాగిం దామె.

మనోజ్ ఆమెని సానుభూతితో చూశాడు. "మిస్ ఇందులేఖా, నేను వెళ్ళొస్తాను...."

ఆమె తటాలున తలతిప్పింది. "మళ్ళీ ఎప్పుడొస్తారు?"

"రాను. కలుసుకోవాలనుకున్న వాళ్ళందర్నీ ఆ దుర్మార్గులు తుదముట్టిస్తున్నారు. బైటికి లాగబడే

నిజాన్ని పాతాళంలోకి తొక్కేస్తున్నారు కొంతకాలం పాటు మాయమైపోయి, ఇవ్వాళే వచ్చాను. ఇప్పుడు నన్ను వాళ్ళు గుర్తించలేకపోవచ్చు. అయినా నిర్లక్ష్యంగా వుంటానికి వీల్లేదు. నా మూలంగా మీకు అపాయం జరక్కూడదు...."

"మిమ్మల్ని వెంటాడే వాళ్ళని మీరు వెంటాడాలి!" ఇందులేఖ నవ్వుతూ అంది. తెల్లటి పళ్ళు పెదవులమధ్య వెల్తుర్ని చిమ్ముతూ మెరిశాయి.

మనోజ్ ఆమెని మెప్పుగా చూశాడు. "మీకు ధైర్యం ఎక్కువ!" అన్నాడు నవ్వుతూ.

"భయపడేవాళ్ళు హాయిగా బతకలేరు!" అందామె. "కూర్చోండి. కాఫీ తెస్తాను.." అంటూ కదలబోయింది.

"ప్లీజ్ .... వొద్దు. వెళ్ళాలి. అనుకున్నది జరిగాక మిమ్మల్ని కలుసుకుంటాను...." మనోజ్ వెనుదిరిగి గుమ్మం వైపు నడిచాడు.

"మిస్టర్ మనోజ్!"

అతను వెనుదిరిగి ప్రశ్నార్థకంగా చూశాడు. ఆమె కళ్ళు తీక్షణంగా చూస్తున్నాయి. "ఈ ప్రయత్నంలో మీరు ఒంటరిగా వున్నారనుకోకండి!"

మనోజ్ ఆశ్చర్యంగా చూస్తూ ఆమె ముందుకి నడిచాడు. జ్యోతుల్లా వెలుగుతున్న ఆమె కళ్ళల్లో యేదో నిర్ణయం ప్రతిఫలిస్తోంది. తనిలోకి ధైర్యాన్ని సరఫరా చేస్తున్న ఆ విశాల నేత్రాలలోకి వుద్రేకంతో చూశాడు.

"మీ మాట నాకు కొండంత ధైర్యాన్నిస్తోంది. మీ ధైర్యాన్ని, నిజాయితీని మెచ్చుకుంటున్నా" అన్నాడతడు.

ఇందులేఖ చూపులు దించుకోలేదు. "మిస్టర్ మనోజ్

ఆ దుర్మార్గులెవరో మనిద్దర్నీ ఒకేరకమైన దుఃఖానికి గురి చేశారు. అన్యాయం న్యాయాన్ని తొక్కేయడం మంచిదికాదు. ప్రయత్నించండి! జయించండి!" అంటూ ఆమె కుడిచేతిని ముందుకు చాచింది. మనోజ్ అప్రయత్నంగా ఆమె చేతిని పట్టుకున్నాడు.

"డబుల్ ఫోర్ డబుల్ త్రీ డబుల్ టూ! ఇది మా ఫోన్ నంబరు. అంత సులువుగా మరిచిపోలేరు. ఫోన్లో మీ ప్రోగ్రెస్ తెలియచేస్తూ వుండండి" అంటూ ఆమె చేతిని విడిపించుకుంది.

చిరునవ్వుతో ఆమెని చూసి మనోజ్ కదిలాడు. ఇందులేఖ అతని వెనకే హాల్లోకి వచ్చింది.

"మీ పత్రికలు..." అందామె.

"మీకే. డెలివరీ ఇచ్చాను!" మనోజ్ నవ్వుతూ అన్నాడు.

* * *

మౌనంగా వింటూ కూచున్న రామానుజం తటాలున సోఫాలోంచి లేచాడు. నిప్పులు చెరుగుతున్న కళ్ళతో అసహ్యంగా చూశాడు.

"గెటౌట్!" అరిచాడతను. అతని శరీరం కళంతప్పి వణుకుతోంది. ఎదురుగా కుర్చీలో కూచున్న మనోజ్ అతన్ని ఆశ్చర్యంగా చూశాడు.

"రామానుజంగారూ...."

"శాల్తావా, పోలీసుల్ని పిలిపించి బైటికి గెంటించి, లోపల తోయించమంటావా?" రామానుజం వృద్ధ సింహంలా హుంకరించాడు.

నిట్టూరుస్తూ మనోజ్ లేచాడు. "శాంతంగా ఆలోచించండి. మీకు అంత ఆగ్రహం రావడానికి నేనేం

తప్పు చేశాను?"

"నా కూతుర్ని నాశనం చేసిన రాక్షసుడి తమ్ముడిగా పుట్టడమే నువ్వు చేసిన తప్పు!" రామానుజం ఆవేశంతో ఊగుతూ అరిచాడు.

"ఐ హేట్ దట్ డెమన్! ఐ హేట్ యూ! గెటౌట్!" ఎడం చేతిని గుమ్మంవైపు చూపిస్తూ గర్జించాడతను.

మనోజ్ అతన్ని నిదానించి చూశాడు. "రామానుజంగారూ, మీ అమ్మాయి గీత దుర్మరణం మిమ్మల్ని నరకయాతన పెడుతోందని నాకు తెలుసు. మొగ్గలాంటి గీతను కాలరాచిన వాళ్ళు వేరు. మా అన్నయ్య నిర్దోషి!"

"హు ...నిర్దోషి! అందుకే జైల్లో కుళ్ళుతున్నాడు! ఆల్ రైట్ ...."

"రామానుజంగారూ, మీరు పెద్దలు. మీరు ద్వేషించాల్సింది మా అన్నయ్యనూ, నన్నూ కాదు. మీ అమ్మాయి హంతకుల్ని!" మనోజ్ అడ్డొస్తూ అన్నాడు.

రామానుజం రౌద్రంగా చూశాడు. అతని మొహం మీద చెమట బిందువులు మెరుస్తున్నాయి. "మీ ఇద్దర్నే కాదు; మీ వంశాన్నే నేను ద్వేషిస్తున్నాను; ద్వేషిస్తాను! గెటౌట్!"

"వెళ్తాను. కేసు జరిగేప్పుడు సాక్ష్యంకోసం పోలీసులు కాకుండా మిమ్మల్ని కల్సుకున్న ఇతర వ్యక్తులెవరేనా వుంటే—వాళ్ళెవరో చెప్పేంతసేపు మీ కోపాన్ని దిగమింగగలరా?" మనోజ్ ప్రశ్నించాడు.

"ఐ సే గెటౌట్!" బిగించిన పిడికిళ్ళని గదల్లా ఆడిస్తూ రామానుజం అరిచాడు.

"ఓకే. వెళ్తాను. మీ కూతుర్ని పొట్టన పెట్టుకున్నది

మా అన్నయ్య కాదని నిరూపించి మీ కళ్ళు తెరిపిస్తాం!" మనోజ్ ఉద్రేకంతో అన్నాడు.

"గెట్ లాస్ట్, యూ బ్రదరాఫ్ మర్డరర్!" రామానుజం గర్జించాడు. అతని ముఖంలోకి తీక్షణంగా చూసి, మనోజ్ వెనుదిరిగి గుమ్మం దాటాడు. తన వెనుక, చెవులు పగిలేలా శబ్దం చేస్తూ మూసుకున్న తలుపువేపు క్షణకాలం చిరునవ్వుతో చూశాడు. సిగరెట్ వెలిగించి రోడ్డుమీదికి అడుగులేశాడు.

* * *

బాగా అలవాటుపడిపోయిన మనోజ్ అప్రయత్నంగా కుంటుతూ నడుస్తున్నాడు.

రకరకాల వాహనాలు అతని పక్కనే అటూ ఇటూ వేగంగా దూసుకుపోతున్నాయి. రోడ్డు రెండుగా చీలింది. యెడమవైపు తిరిగి నడుస్తూ సిగరెట్ పీకని గిరాటేశాడతను.

గీత తండ్రితో ఇంటర్వ్యూ బెడిసికొట్టింది. అతని ద్వారా తను యేమీ తెలుసుకోలేదని తేలిపోయింది!

రామానుజం యింటి అవతలున్న మలుపులోంచీ మెల్లగా తనవేపే వస్తున్న నల్లటి కార్ని, ఆలోచనల్లో మునిగిన మనోజ్ గుర్తించే స్థితిలో లేడు. మెల్లిగా జారుతూ తనని దాటి వెళ్ళిపోయిన నల్లటికార్ని మనోజ్ కళ్ళు చిట్లిస్తూ చూశాడు. వేగం పుంజుకున్న కారు ఎడమవైపుకి తిరిగి ఇళ్ళమధ్య మాయమైంది.

మనోజ్ అప్రయత్నంగా నిలబడ్డాడు. నల్లకారు.... తనని వెంటాడుతోందా? అతని వొళ్ళు ఒకసారి జలదరించింది. వృద్ధుడు రామానుజం గుర్తుకు వచ్చాడు. ఏదో అనుమానం అతని హృదయాన్ని ముల్లులా గుచ్చడం

ప్రారంభించింది. ఇరవై గజాలు నడిచి హోటల్ సిద్ధార్థ లోపలికి వచ్చాడు.

కౌంటర్ ముందు తాంబూలం నముల్తూ కూర్చున్న ప్రొప్రైటర్ ముందు రూపాయి నాణెం పడేశాడు. ఫోన్ వైపు చెయ్యి చూపించాడు. సొరుగులోంచి తాళంచెవి తీసి, ఫోన్‌కి తగిలించిన తాళాన్ని తెరిచి మనోజ్ వైపు తల ఎగరేశాడతను.

రిసీవర్ని చెవికి ఆనించి, మనోజ్ నెంబర్ డయల్ చేశాడు. అటువైపున ఫోను రింగవుతోంది. నిమిషాలు గడుస్తున్నాయి. మనోజ్‌లో ఏదో భయం మెల్ల మెల్లగా ప్రవేశిస్తోంది. అతను ఫోన్ని అందుకునే స్థితిలో లేడా?

తటాలున రిసీవర్ ఎత్తబడిన శబ్దం వినిపించిందతనికి.

"హలో!...." అంది రామానుజం కంఠం మనోజ్ చెవిలో.

"సుబ్బరామయ్యగారున్నారా?" మనోజ్ ప్రశ్నించాడు.

"రాంగ్ నెంబర్!" రామానుజం కంఠం కసిరినట్టుగా అంది.

తేలిగ్గా నిట్టూరుస్తూ, "సారీ!" అంటూ మనోజ్ రిసీవర్ని పెట్టేశాడు.

ఆలోచిస్తూ, మరో నెంబరు తిప్పాడు. అటువైపున వెంటనే రిసీవర్ ఎత్తబడింది.

"డబుల్ ఫోర్, డబుల్ త్రీ, డబుల్ టూ ..." అందో స్త్రీ కంఠం. ఇందులేఖ! తృప్తిగా నవ్వుకుంటూ ఆమెతో మాట్లాడాలన్న కోరికని చంపుకున్నాడు మనోజ్.

"సారీ, రాంగ్ నెంబర్!" అంటూ రిసీవర్ పెట్టేశాడు. బల్లమీద పడేసిన యాభై పైసల చిల్లరమీద అరచేతిని బోర్లించాడు హోటల్ ప్రొప్రయిటర్.

మనోజ్ తేలికపడిన హృదయంతో రోడ్డుమీదికి నడిచాడు. కుడివైపుకి తిరగబోతూ తటాలున ఆగాడు. ఇరవై అడుగుల దూరంలో, రోడ్డు వారగా ఆగివుంది నల్లకారు ...

ఏదో సందేహం అతన్ని మళ్ళీ పీడించడం ప్రారంభించింది.

కిటికీలోంచి తనవైపే చూస్తున్నాడు స్టీరింగ్ వెనుకున్న వ్యక్తి. అతని మొహంమీద మెరిసిన నవ్వుని మనోజ్ గుర్తించాడు. ఆ మొహాన్ని ఎక్కడో చూశాడు తను ఎక్కడ?

మనోజ్ కి బెలూనులు అమ్ముతూ తిరిగిన వ్యక్తి మొహం తటాలున గుర్తుకువచ్చింది. బెలూనులు పట్టుకుని బికారిలా అవుపించిన ఆ వ్యక్తిని కార్లో చూసి, తను వెంటనే పోల్చుకోలేకపోయాడు.

తన వేషంలో,నడకలో తను తెచ్చిపెట్టుకున్న మార్పు తనకి సహాయం చేయడంలేదు! వాళ్ళు తనని పోల్చేశారు! కారు ముందుకు వెళ్ళిపోయింది.

ఈ దాగుడుమూతలు యిక చాలు! మనోజ్ పేవ్మెంట్ పక్కనే వున్న చెట్టుబోదెకి ఆనుకున్నాడు కాసేపు. రివాల్వర్ ని జేబులో పడేసుకోనందుకు విచారిస్తూ సిగరెట్ వెలిగించాడు.

అయిదు నిమిషాలు గడిచాయి.

సిగరెట్ పీకని కింద పడేసి మనోజ్ నడకసాగేడు. నిమిషాలు గడుస్తున్నాయి. రోడ్డుకి అడ్డంగా ప్రవహి

స్తోన్న సన్నటి నదిమీద బ్రిడ్జి ప్రారంభమయింది. బ్రిడ్జి మీద వాహనాలు దూసుకుపోతున్నాయి. మనోజ్ తటాలున ఆగాడు.

నల్లకారు అతని పక్కనే మెల్లిగా కదలసాగింది. మనోజ్ డ్రయివర్ వైపు ఓరగా చూశాడు. యేమీ యెరగనివాడిలా, నవ్వుతూంటూ రోడ్డుని చూస్తున్నా డతను. అతన్ని దాటి కొంచెం ముందుకెళ్ళిన కారు ఆగుతోంది.

మనోజ్ జేబులోంచి సిగరెట్ తీసి నోట్లో యిరికించాడు. అటూ యిటూ చూశాడు. బ్రిడ్జి ఖాళీగా వుంది.

మనోజ్ డ్రయివర్ డోర్ వైపు గెంతాడు. కిటికీ లోంచి లోపలికి తొంగిచూశాడు. అతని చెయ్యి కాల్లోకి వెళ్ళింది. స్టీరింగ్ వెనుక కూచున్న వ్యక్తి పళ్ళికిలిస్తూ నిర్లక్ష్యంగా నవ్వుతున్నాడు.

“అగ్గిపెట్టె వుందా?” మనోజ్ మామూలుగా అడిగాడు.

ఊహించని ఆ పరిణామం కారు డ్రయివర్ని క్షణకాలం కంగారు పెట్టింది. అతని చెయ్యి స్టీరింగ్ మీంచి జేబులోకి అప్రయత్నంగా దూరింది.

మనోజ్ చెయ్యి మెరుపులా కదిలింది. ఇగ్నిషన్ కీని తిప్పి, లాగి, చేతిని ఇవతలికి తీసేసుకున్నాడతను. ఇంజన్ ఆఫ్ అయిపోయింది.

స్టీరింగ్ ముందు కూచున్నతని కళ్ళల్లో ఆశ్చర్యం గడ్డకట్టినట్టు ప్రత్యక్షమైంది. అగ్గిపెట్టెలో యివతలికి వచ్చిన చెయ్యి కదలకుండా అలాగే వుండిపోయింది.

మనోజ్ నిటారుగా నించున్నాడు. ఖాళీ లారీ బ్రిడ్జి

మీదుగా వస్తోంది. తనని దాటి దూసుకెళ్తున్న లారీ బాడీలోకి ఇగ్నిషన్ కీని విసిరేశాడతను. అదేక్షణంలో అతని చెయ్యి కారు డోర్ని విసురుగా లాగింది.

అగ్గిపెట్టె పట్టుకున్న కారు డ్రయివర్ చేతిని మనోజ్ చెయ్యి మంకీస్పానర్ లా పట్టుకుంది. మెలితిప్పుతూ అతన్ని బలంగా లాగాడు మనోజ్. అసంకల్పితంగా వొరుగుతున్న డ్రయివర్ విసురుగా రోడ్డుమీదికి పడ్డాడు. ఆశ్చర్యంనుంచి అతను తేరుకునేలోగా మనోజ్ మెలితిప్పిన చేతిని పైకి లాగాడు. బాధతో పళ్ళు ఇకిలిస్తూ పైకి లేచాడతను.

మనోజ్ కుడిచెయ్యి అతని ఎడమ చేతి మణికట్టుని బిగించి పట్టుకుంది. మనోజ్ కాలు కారు డోర్ని మెల్లగా లోపలికి తోసింది. మూసుకుంటున్న డోరుకీ, ఫ్రేముకీ మధ్య అతని ఎడమ చేతి వేళ్ళను ఇరికించాడు మనోజ్. అతని మోకాలు డోర్ని నొక్కిపట్టింది. బాధతో అతను కెవ్వుమన్నాడు.

మనోజ్ అతన్ని నవ్వుతూ చూశాడు. "అయితే బెలూనులు అమ్మి, కారు సంపాదించావన్న మాట!" అన్నాడతను ఎగతాళిగా.

క్షణకాలం అతని కళ్ళల్లోని బాధను తరిమేస్తూ ఆశ్చర్యం ప్రత్యక్షమైంది. వొగరుస్తూ చూస్తూండిపోయాడతను. మనోజ్ ఎడమచెయ్యి కొద్దిగా కదిలింది. అతని మోకాలు డోర్ని ఒక్కరవ లోపలికి నొక్కింది. మెలితిరిగిపోతున్న కుడిచెయ్యీ, డోర్ మధ్య నలిగిపోతున్న ఎడమచెయ్యీ అతన్ని కీచుగా అరిపించాయి.

"షటప్! అరిస్తే అయిదు వేళ్ళూ చింతకాయల్లా రాలిపోతాయి! కంఠం తగ్గించి మర్యాదగా అడిగినదానికి

సమాధానం చెప్పు! బెలూనులు ఎగరేస్తూ, కారు తోల్తూ జలగలా నన్నెందుకు పట్టుకున్నావ్? నిన్ను నా తోకగా నియమించిం దెవరు?" మనోజ్ కంఠం త్రాచుపాము బుసలా ధ్వనించింది.

జవాబుగా అతని కళ్ళు అటూ యిటూ కదిలాయి. అతిప్రయత్నంమీద బాధను ఓర్చుకుంటున్నా డతడు. మనోజ్ ఎడమచెయ్యి కొంచెం జరిగింది. పురి యెక్కుతున్న తాడులా వున్న అతని చెయ్యి కొద్దిగా సాగింది. పళ్ళతో కింది పెదవిని కొరుక్కున్నాడతను.

మనోజ్ కుడిచెయి అతని నడుముని తడివింది. అతని పాంటుజేబులోకి దూరింది. పర్సునీ, సిగరెట్ పాకెట్నీ, లైటర్నీ తీసి చూసి, జేబులో పడేసుకున్నాడు మనోజ్. యీసారి మనోజ్ చెయ్యి అతని పాంటు జేబులోకి వెళ్ళింది. మనోజ్ చిరునవ్వు నవ్వుతూ చేతిని యివతలికి లాగాడు. అతని కళ్ళల్లోని కొత్త కంగారుని నవ్వుతూ చూశాడు.

నల్లగా మెరుస్తోన్న పిస్టల్ని జేబులోకి దోపుకున్నాడు. తనకోసం సర్వసన్నద్ధంగా వచ్చాడతను! మనోజ్ చింత నిప్పుల్లా వున్న కళ్ళని అతనివైపు తిప్పాడు.

"ఆల్ రైట్. నిన్ను మాట్లాడించడానికి ఇది తగిన ప్రదేశం కాదు. ఒక చక్కటి ప్రదేశానికి తీసుకెళ్తాను. అక్కడికి వెళ్ళగానే నీకు గొంతెత్తి పాటకచ్చేరీ సాగించా లనిపిస్తుంది....!" మనోజ్ వెటకారంగా అన్నాడు.

అతని కుడిచెయ్యి కారు డోర్ని పట్టుకుంది. డోర్ని ఆనుకునివున్న మోకాలు తటాలున పైకి లేచింది. మూలుగుతూ అతను కిందికి వంగేశాడు. డోర్లో ఇరుక్కున్న

చెయ్యి అతన్ని కూలిపోకుండా ఆపింది. బాధ నిండిన కళ్ళతో కసిగా చూశాడతను.

మనోజ్ కారు డోర్ని వదిలేశాడు. అతని కుడిచెయ్యి పాంటు జేబులోకి వెళ్ళి పిస్టల్‌తో ఇవతలకి వచ్చింది. డోర్లోంచి బైటపడిన ఎడమచేతి వేళ్ళను గాభరగా చూసుకుంటున్నాడతను. అతని శరీరం పైకీ కిందికీ ఊగుతోంది, చాలామారం పరుగెట్టి అలసిపోయిన వాడిలా వొగురుస్తున్నాడతను. అతని కాళ్ళమధ్య తూకం వేసినట్టు తగిలిన తన మోకాలి దెబ్బ యిప్పట్లో అతన్ని చక్కగా నడవనివ్వదని మనోజ్‌కి తెలుసు.

మనోజ్ అతని పక్కన నిలబడ్డాడు. మెలితిరిగిన అతని కుడిచేతిని వీపువెనక్కి నొక్కాడు. అతను అరవలేదు బాధని వోర్చుకోడంలో అతను బాగా తర్ఫీదయినట్టున్నాడు!

"డియర్ ఫ్రెండ్, కదులు. అలా పి కారు కెళ్దాం!" అంటూ అతన్ని ముందుకి తోశాడు. వణుకుతున్న కాళ్ళు అతన్ని ముందుకి కదలనివ్వడంలేదు.

"పద! త్వరగా!" అటూ యిటూ వెళ్తున్న వాహనాల్లోని వ్యక్తులు తమవైపు ఆదోరకంగా చూడ్డం గమనించి మనోజ్ అన్నాడు, అతన్ని తోస్తూ.

"అంత తొందరేం లేదు, మిస్టర్ మనోజ్!"

వెనకనుంచి వినిపించిన మాటకి ఆశ్చర్యపోతూ మనోజ్ తల తిప్పబోయాడు.

• • •

"కదలొద్దు మిస్టర్ మనోజ్!" ఏదో కంఠం అతన్ని హెచ్చరించింది. అతని చెవికింద ఏదో చల్లగా గుచ్చుకుంది. మనోజ్ ఉలిక్కిపడ్డాడు, అతని కుడిచెయ్యి

మెల్లిగా, చాలా మెల్లిగా పాంటు జేబువైపు జరుగుతోంది.

“మిస్టర్ మనోజ్, సైలెన్సర్ వున్న పిస్టల్ నీ చెవి కింద ముద్దు పెట్టుకుంటోంది. కుడిచేతిని పైకెత్తు! నీ జేబులోని పిస్టల్ని తీసే అవకాశం నీకు లేదు!” ఆ కంఠం చెవి దగ్గరగా పలికింది. మనోజ్ కుడిచెయ్యి పైకి లేచింది.

“వెరీగుడ్! మెలితిప్పిన అతని చేతిని వదిలేసి, నీ యెడమ చేతిని కూడా పైకెత్తు మిస్టర్ మనోజ్.”

పిస్టల్ని జేబులో పడేసుకున్నందుకు తనని తిట్టుకుంటూ వెనుతిరిగి చూసుకోనందుకు పళ్ళు కొరుక్కుంటూ మనోజ్ ఎడమ చేతిని పైకెత్తాడు.

ఇందాకా అతని చేతుల్లో బందీ అయిన వ్యక్తి మెల్లిగా అతనివైపు తిరిగాడు. నొప్పిని భరించే ప్రయత్నంలో బిగబట్టిన పళ్ళు చేసిన గాయాల్తో అతని పెదవి ఎర్రగా అయింది. బరువుగా వూపిరి పీలుస్తూ అతను మనోజ్ జేబులోంచి సిగరెట్ పాకెట్ని, లైటర్ని, పిస్టల్నీ తీసి, ఎగతాళిగా నవ్వుతూ చూశాడు. పిస్టల్ పిడిని పట్టుకున్న అతని చెయ్యి పైకి లేచింది. మనోజ్ కంగారుగా చూశాడు.

“మూర్ఖుడా! జేబులో పెట్టు!” వెనకనుంచి కంఠం గద్దించింది.

పళ్ళు కొరుక్కుంటూ అతను పిస్టల్ని జేబులో పడేసుకున్నాడు.

“త్రీథర్టీవన్, బేడీలు తగిలించు!” కంఠం ఆజ్ఞాపించింది.

మనోజ్ ఉలిక్కిపడ్డాడు. త్రీథర్టీవన్! గుడ్ గాడ్.... పోలీసులా? అయోమయంగా ఆలోచిస్తోన్న మనోజ్ చేతులు కిందికి, వెనక్కి లాగబడ్డాయి. చేతులకి చల్లగా

తగిలిన బేడీలు క్లిక్కుమన్నాయి.

"కారు స్టార్టు చెయ్!"

"ఇగ్నిషన్ కీ లేదు సార్, వీడు లారీలోకి విసిరేశాడు" మొట్టమొదటిసారిగా డ్రయివర్ మాట్లాడ్డం వినిపించింది మనోజ్‌కి.

"కారు తాళాన్ని లారీలోకి విసురుతూంటే నువ్వేం చేస్తున్నావ్!" ఆ కంఠం వెనుక నుంచీ గద్దించింది. "కమాన్. కార్లోకి యెక్కు. వైర్లు కనెక్టు చెయ్. స్టార్టు కార్!"

నాలుగైదు కార్లూ, ఆటోలూ ఆగిపెట్టున్నాయి. జరుగుతోన్న నాటకం మనుష్యుల్ని ఆకర్షించింది. మనోజ్ వోరగా చూశాడు.

"ఇన్‌స్పెక్టర్ గారూ, ఏం జరిగింది? ఎవరితను?" అక్కడ చేరిన వాళ్ళ ప్రతినిధిగా ఎవరో వ్యక్తి ప్రశ్నించాడు.

"రేపు న్యూస్ పేపర్ చూడండి. తెలుస్తుంది!" తన చెవికి పిస్టల్ ఆనించివున్న వ్యక్తి విసురుగా అనడం మనోజ్‌కి వినిపించింది.

కారు స్టార్టయింది. వెనుక డోర్ తెరవబడింది. వెనుక నుంచీ అతను మనోజ్‌ని కార్లో తోశాడు. పిస్టల్ కొన చెవికింద నుంచి దూరంగా జరిగింది. మనోజ్ సీటుమీద పడ్డాడు. తనని తోస్తూ, సీటుమీదకి జరిగి అతడు డోర్ మూశాడు కారు ముందుకి దూసుకెళ్ళింది.

మనోజ్ తలతిప్పి తన పక్కన కూచున్న వ్యక్తిని చూశాడు. అతని చేతిలో పిస్టల్ లూజాగా వేళ్ళాడుతోంది. ఖాకీ యూనిఫామ్‌లో సన్నగా పొడుగ్గా వున్నాడతను.

—(ఇంకా వుంది)